andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 13 మార్చి 2024



ముదురుతున్న ఎండలు

- జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- జిల్లాలో 38డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల నమోదు

జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మూడు రోజులుగా జిల్లాలో పగటి పూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. జిల్లాలో మంగళవారం 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 దాటితే చాలు సూర్యుడి ప్రతాపం మొదలవుతుండడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉక్కపోతలతో ఇబ్బంది పడుతున్నారు. మార్చిలోనే ఈ పరిస్థితి ఉంటే రాబోయే ఏప్రిల్, మే నెలలో ఉష్ణోగ్రతలు ఏవిధంగా నమోదవుతాయోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు : పక్కన ఇతర అధికారులు


నిజామాబాద్ అర్బన్, మార్చి 12: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ద్వారా ఏ క్షణంలోనైనా షెడ్యూల్ వెలువడే అవకాశం ఉన్నందున ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని ఎన్నికల ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణ అంశాలపై సమీక్ష జరిపారు. ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, వాటి సత్వర పరిష్కారం, 18-19 వయస్సు కలిగిన యువత ఓటరు జాబితాలో పేర్లు నమోదు కోసం దరఖాస్తులు చేయించడం, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, మోడల్ పీఎస్‌ల ఏర్పాటు, మృతి చెందిన, వలస వెళ్లిన ఓటర్ల విషయంలో చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం, వారికి శిక్షణ తరగతులు నిర్వహించడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రాండమైజేషన్, భద్రతాపరమైన ఏర్పాట్లు తదితర అంశాలను సమీక్షిస్తూ జిల్లా ఎన్నికల అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గత ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సెక్టోరల్ అధికారులచే సమస్యాత్మక అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సేకరించాలని వాటి వివరాలను సకాలంలో పంపించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఇప్పటికే నియమించినట్లయితే శనివారం మొదటి ర్యాండమైజేషన్ జరపాలని అన్నారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా ఒకేరోజున ఒకే సమయంలో అన్ని జిల్లాలో చేపట్టాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం అందుబాటులో ఉండేలా చూడాలని తమకు పోస్టల్ బ్యాలెట్ వసతి కల్పించలేదని ఏ ఒక్కరు కూడా ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం కల్పించవద్దని హితవు పలికారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, నోడల్ అధికారి సురేష్‌కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, శ్రీరాందత్తు, భుజంగరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్ సా.6.31	సహర్ ఉ.5.03



సహనం కలవారికి అల్లాహ్ ఎల్లప్పుడు తోడుగా ఉంటాడు. వారిని ఎల్లవేళలా రక్షిస్తాడు



'ప్రజాపాలన' రసీదును చూపిస్తున్న దరఖాస్తుదారుడు

కొందరికే జీరో బిల్లు!

గృహజ్యోతి ప్రతి కుటుంబానికి 200 యూనిట్లు

జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖ అధికారులు బిల్లులు జారీ చేస్తుండటంతో కొందరికి 'జీరో' బిల్లులు వస్తుండగా.. మరికొందరికి మాత్రం బిల్లు చెల్లించాలని రసీదులో సూచిస్తుండడంతో వారంతా మున్సిపల్, మండల కార్యాలయాలకు తరలివస్తున్నారు. 'ప్రజాపాలన' దరఖాస్తుల డాటా ఎంట్రీలో ఆపరేటర్ల తప్పిదాల వల్ల అర్హులకు 'గృహజ్యోతి' అందకుండా పోతోందని, ఆధార్, రేషన్ కార్డుతోపాటు అవసరమైన అన్ని ధ్రువ పత్రాలు సమర్పించినా యథావిధిగా బిల్లులు వచ్చాయని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

- అర్హత ఉన్నా.. వర్తించని 'గృహజ్యోతి'
- 'ప్రజాపాలన' డాటా ఎంట్రీలో తప్పిదాలు
- ఆందోళనలో దరఖాస్తుదారులు
- మున్సిపల్, మండల కార్యాలయాలకు బారులు
- రేషన్ కార్డుకు ఒక మీటరే వర్తింపు



సుభాష్‌నగర్, మార్చి 12: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల స్కీంలో భాగంగా గృహజ్యోతి పథకం అమలు చేస్తోంది. 200యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే అర్హులైన వారందరికీ మార్చి నెల నుంచే 'జీరో' బిల్లు వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అనేక మందికి పాత పద్ధతిలోనే బిల్లులు జారీకావడంతో దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు. కొందరికి వచ్చి.. మరికొందరికి రాకపోవడంతో ప్రజాపాలన సేవ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల ఎదుట బారులు తీరుతున్నారు. దీంతో గృహజ్యోతి దరఖాస్తు దారులతో ఉదయం నుంచి కార్యాలయాలు కిక్కిరిసిపోతున్నాయి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులు గృహజ్యోతి పథకం వర్తించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి విద్యుత్‌శాఖ అధికారులు గృహజ్యోతి పథకంపై సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసినా చాలామందికి జీరో బిల్ వర్తించలేదు.

ఒక రేషన్ కార్డుకు ఒక మీటరు వర్తింపు..

ప్రజాపాలనలో సమర్పించిన రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యుల్లో ఒకరికి మాత్రమే 'గృహజ్యోతి' పథకం వర్తిస్తుంది. అయితే కొందరు ఒకే రేషన్ కార్డుతో రెండు చోట్ల దరఖాస్తు చేసుకోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గ్రామాల్లో పల్లెల్లో ఇళ్లు ఉన్న కొందరు పట్టణాల్లో నివసిస్తున్నారు. వారిలో కొంత మంది తమ సొంత ఊరితో పాటు ప్రస్తుతం నివాసం ఉంటున్న చోట కూడా దరఖాస్తు చేయడంతో 'జీరో' బిల్లు అందకుండా పోతోంది. మరికొన్ని చోట్ల తల్లిదండ్రులు సైతం ఒకే రేషన్‌కార్డు ఉండడంతో గృహజ్యోతి పథకం అమలు కావడం లేదు. విద్యుత్‌శాఖ అధికారులు ఇంటింటికీ తిరిగి మీటర్ నెంబర్, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు నెంబర్లు నమోదు చేసుకున్న సమయంలో దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోవడంతో కూడా జీరో బిల్లు అమలు కాలేదు.

డాటా ఎంట్రీతోనే సమస్యలు..

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీల కోసం ప్రజాపాలన దరఖాస్తులు గత నెలలో ప్రజల నుంచి స్వీకరించింది. ఈ దరఖాస్తులను ప్రతి మండల, మున్సిపల్ కార్యాలయాల్లో డాటా ఎంట్రీ ఆపరేటర్లతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయించారు. ప్రత్యేకంగా డాటా ఎంట్రీ కోసం ఆపరేటర్లను దరఖాస్తుకు కొంతమొత్తంలో చెల్లించి నమోదు ప్రక్రియను పూర్తిచేశారు. అయితే డాటాఎంట్రీ సమయంలోనే ఆపరేటర్లు తప్పిదాలు జరిగినట్లు తెలిసింది. నమోదు సమయంలో ఆధార్, రేషన్‌కార్డు, మొబైల్ నెంబర్లలో తప్పిదాలు జరగడంతో గృహజ్యోతి పథకం కొందరు అర్హులకు వర్తించలేదు. దీంతో మరోసారి ప్రత్యేక ప్రజాపాలన కేంద్రాలను దరఖాస్తులు బారులు తీరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కేంద్రాల ఏర్పాటు...

గృహజ్యోతి, రూ.500 సిలిండర్ పథకం అమలులో సమస్యల నివారణ కోసం ప్రజాపాలన కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజా పాలన కేంద్రాల్లో ఉచిత విద్యుత్, రూ.500 సిలిండర్ పథకం అమలు కాని వారు మళ్లీ ఈ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ప్రజాపాలన కేంద్రాలలో వారి దరఖాస్తులను స్వీకరించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదుచేసి సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఫోన్ నెంబర్‌తో సైతం సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రజాపాలన దరఖాస్తులు ఇచ్చిన ఫోన్ నెంబర్ ప్రస్తుతం వాడుతున్న నెంబర్ వేర్వేరు కావడంతో కొన్ని చోట్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ఓటీపీ కోసం నెంబర్ తప్పనిసరి కావడంతో ఇచ్చిన నెంబర్‌తో సమస్యలు తలెత్తుతున్నాయి.



దరఖాస్తు చేసుకున్నా.. జీరో బిల్ రాలేదు

: పిండి భోజమ్మ, డొంకేశ్వర్



ప్రజాపాలనలో ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకున్నా. అన్ని వివరాలను దరఖాస్తులో నమోదు చేశాను. విద్యుత్‌శాఖ అధికారులు కూడా ఇంటికి వచ్చి జీరో బిల్ కోసం వివరాలు అన్ని తీసుకున్నారు. అయినా కరెంట్‌బిల్ జీరో అని రాలేదు. మళ్లా దరఖాస్తు చేద్దామని ప్రజాపాలన కేంద్రానికి వచ్చిన.

అవసరమైన పత్రాలు అందించినా.. రాలేదు

: సుగుణ, నడ్మడ గ్రామం



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలకు అన్ని అవసరమైన దరఖాస్తు ఇచ్చాను. ప్రజాపాలన సమయంలో దరఖాస్తు అందజేశాను. అయినా గృహజ్యోతి పథకం అమలు కాలేదు. మళ్లీ ప్రజాపాలన కేంద్రానికి వచ్చి వివరాలను అందించాను. డాటా ఎంట్రీ చేసుకున్నారు. ఇప్పుడైనా గృహజ్యోతి పథకం వర్తించేలా అధికారులు చొరవచూపాలి.



డొంకేశ్వర్‌లోని ప్రజాపాలన సేవ కేంద్రం ఎదుట బారులు తీరిన దరఖాస్తుదారులు





- రైల్వే గూడ్స్ షెడ్డును వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

రైల్వే గూడ్స్ షెడ్డు ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- కార్యక్రమానికి హాజరైన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

డిచ్‌పల్లి, మార్చి 12: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైల్వే గూడ్స్ షెడ్డును వర్చువల్‌గా ప్రధాని నరేంద్రమోదీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని రూ.85వేల కోట్లతో చేపట్టనున్న రైల్వే ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ.. గతంలో రైల్వేల పరిస్థితి అధ్వానంగా ఉండేదని, రానున్న తరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైల్వేలను ఆధునికీకరణకు మోదీ గ్యారంటీ అని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రంగాలను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, ప్రతిపక్షాలు ఓట్ల కోసం అనవసరంగా ఆరోపించడం సరికాదన్నారు. పదేళ్ల కాలంలో దేశంలో ఎంతో అభివృద్ధి జరిగిందని ప్రధాని మోదీ అన్నారు.

మోదీని మూడో సారి ప్రధానిని చేయాలి..

: అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

బీజేపీ చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీని మూడోసారి దేశ ప్రధానిని చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. మంగళవారం డిచ్‌పల్లిలో రైల్వే గూడ్స్ షెడ్డు ప్రారంభోత్సవానికి ధన్‌పాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది రాజకీయ వేదిక కానప్పటికీ.. దేశంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తాను మాట్లాడుతున్నానని, కాంగ్రెస్ హయాంలో 60ఏళ్లలో చేయాని అభివృద్ధి నరేంద్ర మోదీ ప్రభుత్వం 10ఏళ్లలో చేసిందని పేర్కొన్నారు. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ మాస్టర్ గంగారాజు మాట్లాడుతూ.. గూడ్స్ షెడ్డు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.1000 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, బీజేపీ నాయకులు వెంకటరమణ, చంద్రకాంత్, లక్ష్మణ్, ఎంపీటీసీ రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు, ఘన్‌పూర్ వీడీసీ సభ్యులు, రైల్వే అసిస్టెంట్ డివిజన్ మెకానికల్ ఇంజనీర్ రాజు, గూడ్స్ షెడ్డు ఇన్‌చార్జి రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పోలీసులమని నమ్మించి దోచుకెళ్లిన దుండగులు

● మూడున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు ● నవీపేటలో ఘటన

నవీపేట,మార్చి12: మండల కేంద్రంలోని పాత పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం పోలీసులమని చెప్పి సినీ ఫక్కీలో వ్యక్తి నుంచి మూడున్నర తులాల బంగారు ఆభరణాలను దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు నర్సింహా చారి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. నర్సింహా చారి గతంలో ట్రాన్స్‌కో లైన్‌మన్‌గా పని చేసి రిటైర్డ్ అయి నవీపేటలోని లింగమయ్య గుట్ట కాలనీలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం సుమారు 10:15గంటల సమయంలో తన స్కూటీపై నవీపేటలోకి కంటి దవాఖానాకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. పాత పెట్రోల్ బంక్ సమీపంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు అతనిని అటకాయించారు. తాము పోలీసులమని, ముందు పెద్దసార్లు వాహనాలు తనిఖీ చేస్తున్నారని వెంటనే తన ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను స్కూటీలో పెట్టుకోవాలని పురమాయించారు. దీంతో మెడలో ఉన్న తులంన్నర బంగారు గొలుసు, చేతి వేళ్లకు తులం బరువు ఉన్న రెండు బంగారు ఉంగరాలను కాగితంలో చుట్టచుట్టి స్కూటీలోని డిక్కీలో పెడుతున్నట్లు నటించారు. నిజమైన బంగారు ఆభరణాలను వారు తమ జేబులో వేసుకుని తమ జేబులో ఉన్న ఐదు రోల్డ్‌గోల్డ్ ఉంగరాలు గల కాగితం చుట్టను స్కూటీ డిక్కీలో ఉంచారు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత అనుమానం వచ్చిన అతుడు డిక్కీ తెరిచి చూడగా.. అందులో ఐదు రోల్డ్‌గోల్డ్ ఉంగరాలు కనిపించడంతో అవాక్కయ్యాడు. వెంటనే ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తించారు. ఈ మేరకు బాధితుడు నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగులను పట్టుకోవడానికి నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్, ఎస్ఐ యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు.



బైక్‌పై పారిపోతున్న దుండగులు

ఇంటర్ పరీక్షల్లో 26 మంది డిబార్

నిజామాబాద్ అర్బన్, మార్చి 12: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో రికార్డు స్థాయిలో ఒకేరోజు 26 మంది డిబార్ కావడం జిల్లాలో చర్చనీయాంశమైంది. మంగళవారం నిర్వహించిన ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-2 పరీక్షల్లో జిల్లాలోని మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 16 మంది, ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9 మంది, హరిచరణ్ కళాశాలలో ఒకరిపై అధికారులు మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 16,633 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 16,136 మంది హాజరుకాగా, 497 మంది గైర్హాజరయ్యారు. డీఈసీ కమిటీ 8, హెచ్‌పీసీ కమిటీ 6, ఫ్లయింగ్ సిట్టింగ్ స్క్వాడ్ 30, డీఐఈవో 2 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

● తొమ్మిది మంది విద్యార్థుల డిబార్

ధర్పల్లి: మండల కేంద్రంలో గల జూనియర్ కళాశాలలో జరుగు తున్న ఇంటర్మీడియెట్ పరీక్షలో మంగళవారం జరిగిన పరీక్షలో తొమ్మిది విద్యార్థులు డిబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి సురేష్‌బాబు తెలిపారు. భౌతికశాస్త్రం పరీక్ష రాస్తున్న నలుగురు, అర్థశాస్త్రం పరీక్ష రాస్తున్న ఐదుగురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడిన ట్లు తెలిపారు. 445 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 442 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని అన్నారు. పరీక్ష కేంద్రాన్ని ఇంటర్మీడియెట్ బోర్డు స్క్వాడ్ హైదరాబాద్ తనిఖీ చేసినట్లు తెలిపారు.

'మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలు అభ్యంతరకరం'

బోధన్ రూరల్, మార్చి 12 : మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలు అభ్యంతరకరమని తెలుగుదేశం నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ హనుమంతరావు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్‌రావు ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సుఖాలు అనుభవిస్తూ ఏసీ గదులలో కూర్చుంటున్నారని ఆయన విమర్శించడం ఆయన దొరల అహంకారానికి నిదర్శనమన్నారు. ఉద్యమ కాలంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సానుభూతితో వారి సహకారాన్ని పొంది ఇప్పుడు అధికారం పోయిన తరువాత ఉద్యోగ వర్గాలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్మికులకు హరీష్‌రావు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. లేనియెడల భవిష్యత్తులో ప్రజలు నిలదీస్తారని హెచ్చరించారు.

ఘనంగా రామకృష్ణ జయంతి వేడుకలు

ఖిల్లా, మార్చి 12: నగరంలోని శివాజీనగర్‌లోగల రామకృష్ణ కుటీర్లో 189వ రామకృష్ణ జయంతి తిథి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ చారి మాట్లాడుతూ రామకృష్ణ స్వామి తెలిపిన విధంగానే ఉత్సవాలు జరుగుతున్నాయని అన్నారు. ఉదయించడం ఒక ఉత్సవం అయితే సాయంత్రం మహా ఉత్సవంగా పేర్కొన్నారు. ఈ రెండిటి మధ్య నిత్య ఉత్సవం ఎప్పుడైతే మానవుడు తనను తాను జాగృతపరుస్తూ పరుల విషయంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటాడో అది ఉత్సవం లాంటిదన్నారు. ఒకరిని ఒకరు ప్రేమించినప్పుడే శత్రువును కూడా ప్రేమించినప్పుడే లోక కల్యాణం జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ సేవా కేంద్రాల్లో యజ్ఞం నిర్వహించారు. ఈ యజ్ఞం ద్వారా ప్రకృతి శుద్ధి జరుగుతోందని ప్రతి మనిషి శుద్ధితో ఉంటే అదే మహాయజ్ఞంగా భావింపబడుతుందని తెలిపారు. రామకృష్ణ జన్మదిన వేడుకలతో పాటు ఇటీవల నిర్వహించిన 32వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెజిషియన్ రంగనాథ్, పాఠశాల యాజమాన్యం శశిరేఖ శ్రీనివాస్, మధుమాధురి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టొద్దు

నిజామాబాద్‌అర్బన్, మార్చి 12:అంగన్‌వాడి కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయో మెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, యూనియన్ గౌరవ అధ్యక్షులు రమేష్‌బాబులు మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలకు ఒక పూట బడితో పాటు మే నెల మొత్తం టీచర్స్‌కు, హెల్పర్లకు సెలవులు ఇవ్వాలన్నారు. 24 రోజుల సమ్మె హామీలలో వెంటనే అమలు చేయాలని, హెల్పర్లకు పాత పద్ధతిలోనే పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవగంగు, స్వర్ణ, చంద్రకళ, మంగాదేవి, వాణి, జ్యోతి పాల్గొన్నారు.

నేడు సారంగాపూర్ ఫ్యాక్టరీకి రూరల్ ఎమ్మెల్యే, కలెక్టర్

నిజామాబాద్ రూరల్, మార్చి 12: రూరల్ పరిధిలోని సారంగపూర్ సహకార చక్కెర కార్మాగారాన్ని సందర్శించడానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతులు బుధవారం సందర్శించనున్నారు. ఒకప్పుడు విజయవంతంగా నిర్వహించబడ్డ ఈ ఫ్యాక్టరీ కొన్నేళ్లుగా మూతపడింది. బోధన్‌లోని షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అదే సమయంలో సారంగాపూర్ చక్కెర కర్మాగారం కూడా పునరుద్ధరించాలని చక్కెర రైతులు, కార్మికులు కొన్నేళ్లుగా ఉద్యమం చేస్తున్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలు, ఫ్యాక్టరీ యంత్రాలు వంట వాటిని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం. చెరుకు రైతులు, ఫ్యాక్టరీ పునర్ధరణ కమీటీ సభ్యులు, కార్మికులు సైతం వచ్చి కలెక్టర్‌కు, రూరల్ ఎమ్మెల్యేకు సమస్యలు వివరించనున్నట్లు ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ సభ్యులు తెలిపారు.

బోధన్ ఆసుపత్రికి చేరిన మాతా శిశు ఆరోగ్య కిట్లు



మాతా శిశు ఆరోగ్య కిట్లు ఆసుపత్రికి చేరిన దృశ్యం

బోధన్ రూరల్, మార్చి 12 : 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఫిబ్రవరి 21న ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎంసీహెచ్ కిట్ల కొరత, ఆసుపత్రుల చుట్టూ తిరుగు తున్న బాలింతలు అనే శీర్షికతో కథనం ప్రచురిత మైంది. ఈవార్త కథనానికి స్పంది చిన వైద్య ఆరోగ్య శాఖ ప్రభు త్వానికి నివేదిక అందజేయడంతో మంగళవారం బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి మాతా శిశు ఆరో గ్య కిట్లు సుమారు 200 వరకు వచ్చాయి. నేటి నుంచి బాలింతలకు ఇవ్వాల్సిన కిట్లను అందజేస్తామని వైద్యులు తెలిపారు. కిట్లు రావడంతో బాలింతలు హర్షం వ్యక్తంచేశారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి'

ఖిల్లా, మార్చి 12: మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని మొదటి అదనపు న్యాయాధికారి కుష్బూ ఉపాధ్యాయ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అదనపు న్యాయాధికారి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు మనోధైర్యాన్ని కోల్పోకుండా అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. ప్రతీ మహిళ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆలక్ష్య సాధనకు కృషి చేయాలని అన్నారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆనందంగా స్వేచ్ఛగా జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు చిన్నారులతో, మహిళలతో, యువతులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభకనబర్చిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం చిన్నారితో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషినరీ ఐపీఎస్ బి.చైతన్యరెడ్డి, డాక్టర్ కిరణ్మయి (ఐపీఎస్ ట్రైనీ), తేజిత, ఇన్స్‌పెక్టర్ శ్రీలత, ఎస్సైలు అంజమ్మ, పద్మ, కుమారి, ప్రవళిక, ఆర్ఎస్ఐ స్రవంతి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పోలీస్ కార్యాలయాల సిబ్బంది, హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారిని సన్మానిస్తున్న జిల్లా న్యాయాధికారి

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

నిజామాబాద్ అర్బన్: ఆకాశంలో సగం అవకాశాల్లో సగం అన్నింటా సగంలా ఉండాలని డాక్టర్ వనం అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగారంలోని డిగ్రీ గిరిజన కళాశాలలో రోటరీక్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ విధిరాతను ఎదురించి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తూ ఎందరో నారీమణులు చరిత్రలో తమకంటూ స్థానాన్ని సంపాదించు కున్నార న్నారు. మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెంద దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సయ్యదా జైనాబ్, రోటరీ క్లబ్ జెమ్స్ ప్రాజెక్టు చైర్మన్ కోటగిరి చంద్రశేఖర్, కార్యదర్శి వీరబ్రహ్మం, సభ్యులు సూర్యప్రకాశ్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన షేక్ మున్న

ఆర్మూర్‌టౌన్, మార్చి12: ఆర్మూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్న మంగళవారం ఇన్‌చార్జీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. గతంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై జనవరి 4న అవిశ్వాస పరీక్ష నిర్వహించడంతో అధికారులు అవిశ్వాస పరీక్ష నెగ్గిందని తెలిపారు. దీంతో పండిత్ వినీత అవిశ్వాస పరీక్ష వీగిందని, 2/3 సభ్యులు ఓటు వేయలేదని హైకోర్టును ఆశ్రయించగా తన కేసును కోర్టు కొట్టివేసింది. దీంతో జరిగిన పరిణామాల దృష్ట్యా ఇప్పటి వరకు చైర్‌పర్సన్ ఎన్నికకు మార్గం సుగమం కాలేదు. ఇలా ఉండగా ఇటీవల మున్సిపల్ వైస్ చైర్మన్ తో పాటు 15మంది కౌన్సిలర్‌లు బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమ క్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మున్సిపల్ సమావేశాల నిర్వహణకు గాను వైస్‌చైర్మన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా జిల్లా కలెక్టర్ మున్సిపల్ ఇన్‌చార్జీ చైర్మన్‌గా షేక్ మున్నను బాధ్యతలు చేపట్టాలని సోమవారం ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన షేక్ మున్నను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు ఘనంగా సన్మానించారు.


షేక్ మున్నను శుభాకాంక్షలు తెలుపుతున్న కౌన్సిలర్లు

పరీక్షల పట్ల భయాందోళనకు గురికావొద్దు

● జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్


మోర్తాడ్‌లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

మోర్తాడ్,మార్చి12: మోర్తాడ్ మండలంలోని కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రభుత్వ పాఠశాలలో జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ సందర్శించారు. మంగళవారం పదోతరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ పరీక్షలు ఏలాంటి భయాందోళనలు లేకుండా రాయాలని, పదవ తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. ఈనెల 18నుంచి జరిగే వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్య వనరుల కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఈ నెల 18 నుంచి ప్రారంభ కానున్న పదోతరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా అన్ని సిద్ధం చేశామని విద్యార్థులు పరీక్షల పట్ల భయాందోళనలకు గురికాగుండా చక్కగా చదివి పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా విద్యాధికారి ఎస్‌వి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల పాఠశాలను జీసీవో వనితతో కలిసి సందర్శించి పదోతరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని వారికి అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. మండలంలోని పదోతరగత పరీక్ష కేంద్రాల వివరాలను అందులో సదుపాయాలను మండల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

పౌరసత్వ సవరణ చట్టం అమలుపై హర్షం

ఆర్మూర్‌టౌన్, మార్చి12: దేశంలో పౌరసత్వ సవరణ చట్టం అమలు పరుస్తూ అధికార పత్రం గెజిట్‌ను విడుదల చేయడంతో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016 జూలైలో పార్టీ పౌరసత్వ సవరణ చట్టం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ బిల్లు ఆమోదం కాగా ఈశాన్య రాష్ట్రాల్లో వ్యతిరేకంగా పెద్ద ఎత్తున హింసాత్మక సంఘటనలు జరగడంతో రాజ్యసభలో బిల్లుఆమోదం చెందలేక పోయిందని, 2019లో ఈ బిల్లును ఉభయసభల్లో బిల్లును ఆమోదం చేసుకో వడం జరిగిందని అన్నారు. ఈ బిల్లులు ముస్లీంలకు వ్యతిరేకం కాదని, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వీడిపోయినప్పుడు అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ బంగ్లాదేశ్‌లో ఉన్నటువంటి మైనారిటీలైన హిందువులను భారత దేశానికి వచ్చిన ఉండాల్సిందిగా కోరడమైందని, ఆ రోజు ఇందిరాగాంధీ ముస్లీంలను రమ్మని చెప్పలేదని ఈ విషయాన్ని కాంగ్రెస్ మిగతా పార్టీ వారు గ్రహించాలని సూచిం చారు. మనదేశంలో మయన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యాలు ఇతర దేశాల నుంచి వచ్చినటువంటి వారిని కొన్ని రాజకీయ పక్షాలు ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొని పబ్బం గడుపుతున్నారని ఇదీ సమంజసంకాదని, రాబోయే కాలాన్ని ఎంతో ప్రమాదకరమని, పౌరసత్వ సవరణ చట్టం వెంటనే అమలులోకి తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శి పులి యుగందర్, ఉపాధ్యక్షుడు దోండి ప్రకాష్, పల్లె శ్రీనివాస్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కలిగోట ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, బాశెట్టి రాజ్‌కుమార్, అమ్దాల విజయ్, గోపాల్‌యాదవ్, ప్రవీన్, నవీన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్‌కుమార్

బస్సు డ్రైవర్‌కు తీవ్ర అస్వస్థత

● సమయ స్ఫూర్తితో బస్సు నిలిపివేత
● తృటిలో తప్పిన పెను ప్రమాదం

నవీపేట, మార్చి 12 : నిర్మల్ జిల్లా తానూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బస్సు డ్రైవర్ అస్వస్థతకు గురి కాగా.. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి బస్సును నిలిపివేసిన ఘటన నిజామాబాద్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు తానూర్ నుంచి హైదరాబాద్‌లో జరిగే మహిళా శక్తి సదస్సుకు మంగళవారం మహిళలతో బయలుదేరింది. ఈ బస్సులో 43మంది ఉన్నారు. బస్సు మార్గమధ్యలో నవీపేట వద్దకు రాగానే డ్రైవర్ సలీంకు ఒక్కసారిగా బీపీ ఎక్కువైపోయి చెమటలు పట్టసాగాయి. అయినప్పటికీ అతను బస్సును నవీపేట ఆర్టీసీ బస్టాండ్‌లోకి మళ్లించి ఒక మూలన నిలిపివేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న కంట్రోలర్ మహేశ్ అస్వస్థతకు గురైన డ్రైవర్‌ను సలీంను స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం అతనిని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యామ్నాయంగా మరో బస్సును ఏర్పాటు చేసి వారిని హైదరాబాద్ తరలించారు. కాగా.. అస్వస్థతకు గురైనప్పటికీ డ్రైవర్ సలీం సమయస్ఫూర్తితో బస్సును బస్టాండ్‌కు తరలించి నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని మహిళలు తెలిపారు.

అర్గుల్‌లో సీసీరోడ్డు పనుల ప్రారంభం

జక్రాన్‌పల్లి, మార్చి12: మండలంలోని అర్గుల్ గ్రామంలో మంగళవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులు ప్రారంభించి నిర్మాణ పనులు చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అనిత, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ బైపాస్ వద్ద కారు, డీసీఎం ఢీ

నిజామాబాద్ రూరల్, మార్చి 12: జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద సోమవారం అర్ధరాత్రి రెండు వాహనాలు ఢీకొన్న ఘటన జరిగినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి సమయం దాటిన తర్వాత మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు 150 గొర్రెలు తీసుకుని డీసీఎం వెళ్తోంది. కంఠేశ్వర్ బైపాస్ వద్ద సిగ్నల్ దాటుతుండగాఆర్మూర్ నుంచినిజామాబాద్‌కు షిఫ్ట్ కారు వేగంగా వచ్చి డీసీఎంను ఢీకొంది. దాంతో షిఫ్ట్ కారు బోల్తాపడటంతో కారులో ఉన్నవారికి గాయాల య్యాయి.ఈ ప్రమాదంలో డీసీఎం వాహనంలోని 25 గొర్రెలు సైతం మృత్యువాతపడ్డాయి. డీసీఎం వాహనం డ్రైవర్ ప్రకాష్ ఫిర్యాదుమేరకు షిఫ్ట్ కారు డ్రైవర్ అవినాష్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

జలాల్‌పూర్‌లో కుక్కల స్వైర విహారం

● 15 మందిని కరిసిన పిచ్చి కుక్క ● కొట్టిచంపిన గ్రామస్థులు

నిజామాబాద్ రూరల్, మార్చి 12: రూరల్ మండలం జలాల్‌పూర్‌లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆది వారం రాత్రి పిచ్చికుక్కలు గ్రామస్థులపై తమ ప్రతాపం చూపాయి. ఇంటి వద్ద కూర్చున్నవారిని, వీధిలో వెళ్తున్న వారిని సైతం వదలలేదు. 15మందిని కరిచాయి. రెండు గొర్రెలు, ఒక గేదెపై కూడా దాడి చేశాయి. దాంతో స్థానికులు కుక్కలను పట్టుకుని బంధించి వాటిని చంపివేసినట్లు తెలిపారు. జలాల్‌పూర్ గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని, వాటిని పట్టుకుని గ్రామం బయట వదిలివేయాలని కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌ను కలిసిన సీపీ


ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ

నిజామాబాద్ అర్బన్, మార్చి 12:ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌లు మంగళవారం భేటీ అయ్యారు. నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఇరువురు మర్యాదపూర్వకంగా కలుసుకొని పలు అంశాలను చర్చించుకున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం రంజాన్ మాసం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మహేష్‌కుమార్‌గౌడ్ సీపీని కోరారు.నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని కోరినట్లు తెలుస్తోంది. అదేవిధం గా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, నగర ఎక్సైజ్ సీఐ దిలీప్‌లు మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిశారు.

ఎన్నికల కోడ్‌కు ముందే సమావేశం ఏర్పాటు చేయాలి

● కమిషనర్‌ను కోరిన బీజేపీ కార్పొరేటర్లు


కమిషనర్‌ను కలిసిన బీజేపీ కార్పొరేటర్లు

సుభాష్‌నగర్, మార్చి 12: పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకముందే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని బీజేపీ కార్పొరేటర్లు మున్సిపల్ కమిషనర్ మందమ కరంద్‌నుకలిశారు.గత బడ్జెట్ సమావేశంలో నగరంలోని పలు సమస్యలపై చర్చించే అవకాశం రాలేదని కమిషనర్‌కు తెలిపారు. ప్రజల సమస్యలపై చర్చించేందుకు డివిజన్‌లోని అభివృద్ధి పనులకు ఒక్కో డివిజన్‌కు రూ.10లక్షల కేటాయిం చడంపై సరైనా స్పష్టత లేదని, పెండింగ్‌లో ఉన్న డివిజన్‌కు రూ.కోటి అభివృద్ధి పనులపై చర్చించేందుకు కౌన్సిల్ సమా వేశం ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్‌ను కలిసినవారిలో బీజేపీమున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు, కార్పొరేటర్లు ప్రవళిక, ఆకు ల హేమలత, మల్లేష్ యాదవ్,మెట్టువిజయ్, వైష్ణవిలు ఉన్నారు.

రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్‌గా హరోన్‌ఖాన్

నిజామాబాద్ అర్బన్, మార్చి 12:తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్‌గా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ హరోన్‌ఖాన్ ఎంపికయ్యారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల పలు కార్పొరేషన్‌లకు కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా నగరానికి చెందిన కార్పొరేటర్ హరోన్‌ఖాన్‌ను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్‌గా నియమించారు.ఈసందర్భంగా హరోన్‌ఖాన్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మాజీ మంత్రి షబ్బీర్ అలీకి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

కూలీల సంఖ్య పెంచాలి

ధర్పల్లి,మార్చి 12:ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందిని ఎండీవో బాలకిషన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని చల్లగరిగె గ్రామంలో గల నర్సరీని, ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్యను పెంచాలని పనులు జరిగే చోట తాగునీటి వసతి కల్పించాలని సూచించారు.

జైనపూర్ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలి

కోటగిరి,మార్చి12: కోటగిరి మండల కేంద్రంలోని జైనపూర్ శివారులో నిజాంసాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించాలని రైతులు కోరారు. ఈ విషయమై కోటగిరి తహసీల్దార్ సునీతను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతులు కలిసి వినతిపత్రం సమర్పించారు. జైనపూర్ శివారులో వరిపంటకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడేందుకు సాగునీటిని అందించాలని రైతులు కోరారు. ఈవిషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి సాగునీటి సమస్యను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు గజేందర్, సతీష్, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది'

ఏర్గట్ల, మార్చి 12: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న హామీలో భాగమైన గృహజ్యోతి 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ లబ్ధిదారులకు జీరో బిల్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రనగర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


నాగేంద్రనగర్‌లో జీరో బిల్లు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.220	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.230	రూ. 270

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.66,200	రూ.66,100	రూ.765

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : శైతాన్ (హిందీ)(10.20,1.20,4.20,7.20,10.20)
స్క్రీన్-2 :గామి(10.00, 1.10, 4.20, 7.35, 10.45)
స్క్రీన్-3 : భీమా (12.20,6.55)
: దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (3.25)
:ఆపరేషన్ వాలెంటైన్ (10.00)
స్క్రీన్-4 : బాబు (1.30)
: రికార్డుబ్రేక్ (4.15)
:మంజుమెల్‌బాయ్స్ (మళయాలం) (7.15)
ప్రేమలు (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : భీమా (10.50,1.40, 4.30,7.30,10.30)
స్క్రీన్-2 ప్రేమలు (1.30,7.30)
:ఆపరేషన్ వాలెంటైన్ (4.30,10.30)
స్క్రీన్-3 :గామి(10.30, 1.30, 4.30, 7.30, 10.30)

దేవి ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : భీమా (11.15, 2.15, 6.15 9.15,)
నటరాజ్ : శైతాన్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : గామి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్